


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 11 ఫిబ్రవరి, 2015 సంచిక : 9



**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech


**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| వార్షిక చందా | ........... | రూ॥ 80/- |
| ఆజీవ సభ్యత్వం | ........... | రూ॥ 800/- |


**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com


**విషయసూచిక** **పుట సంఖ్య**


మా వాణి ........ 2
శ్రీ సాయి-సేవ ........ 7
అర్హత ........ 8
షిర్డీసాయి చరితము ........ 9
గజానన విజయం ........ 10
షిరిడీ డైరీ ........ 11
స్వరాంజలి ........ 13
లేఖావాణి ........ 14
మాతృసంస్థ కబుర్లు ........ 16
పొరుగుసంస్థ కబుర్లు ........ 17
అలనాటి పులిలాగా ........ 20
మంగళాశీస్సులు ........ 22
నేను సాయివాణిని ........ 23
సాయివాణికి స్వరార్చన ........ 25
ఓ పాత లేఖ ........ 25
అనుభవాలు-అనుభూతు ........ 28








# మా వాణి



"మరో క్రొత్త సంవత్సరం - మరిన్ని క్రొత్త అనుభవాలు - మరి కొన్ని క్రొత్త దుండగాలు" అని నేనంటే "ఏమో, కొత్త సౌభాగ్యాలు వస్తాయేమో!" అన్నది మా పాపాయి. వస్తే సంతోషమే. కానీ, అలా జరుగుతుందన్న ఆశ ఏ మూలనైనా కనిపిస్తున్నదా? పన్నులు, ప్రాజెక్టులు, పదవులు, రహదార్లు, రైళ్ళు, విదేశ బంధాలు వగైరాల గురించి నేనేమీ ఆలోచించటం లేదు. ఈ గడ్డ మీది స్త్రీ, పురుష సంబంధాలు, స్త్రీల జీవితాల గురించి మథనపడుతున్నాను.

'ఆడపిల్లనొకలాగా, మగబిడ్డనొకలాగా పెంచుతున్నారు, చదివించటం లేదు' - ఇది ఒక ప్రక్క. ఒక రకమైన దిగజార్చుడు, తొక్కిపెట్టుడు వ్యవహారం. దీన్ని కాలమే క్రమంగా మారుస్తూ వస్తోంది. ఎక్కడో నిరక్షరాస్య, మూర్ఖ జనాల్లో తప్ప 'ఎవరైతే ఏంలెద్దూ!" అన్న భావన బయలుదేరింది. వృద్ధులైతే కొందరు 'కొడుకులకన్నా కూతుళ్లే నయం. కనీసం ప్రేమగా పలకరించనైనా పలకరిస్తారు' అనుకోవటం కూడా జరుగుతోంది. ఇది ఇలా ఉంచుదాం. కూతుళ్లను కొడుకులతో సమంగా పెంచి, చదివించి, ఉద్యోగాల్లో పెట్టిన తల్లిదండ్రులైనా నిశ్చింతగా ఉండగలుగుతున్నారా? బయటికి వెళ్లిన మగపిల్లవాడు వేళకు యింటికి తిరిగి రాకపోతే - ఏ ఫ్రెండ్స్‌తోనో ఉండి ఉంటాడు, ఏ సినిమాకో పోయిఉంటాడు అని సరిపెట్టుకోగలం. కాకపోతే 'ఏక్సిడెంటేమీ కాలేదు గదా!' అని భయపడతాం. అదే ఆడపిల్ల వేళకు రాకపోతే ఎంత ఆరాటం, భయం! పిల్లకేమైందోనన్న భీతితోపాటు లోకభీతి కూడా జతపడుతుంది ఆ క్షణంలో. వెంటనే ఎక్కడెక్కడో జరిగిన అత్యాచారాలు, హత్యలు అన్నీ గుర్తు వచ్చి

గిలగిలలాడుతున్నాం. అంటే ఏమిటి? చదువు ఉండటం, లేకపోవటాలతో స్త్రీ రక్షణకు సంబంధం లేదన్నమాట.

"వరసా, వావీ, స్థలం, వేళ, వయస్సు-వేటితోనూ నిమిత్తం లేకుండా స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలకు మూలం ఏమిటి? ఎప్పుడూ యిలా జరుగుతుండేవా? ఇప్పుడే క్రొత్తగా జరుగుతున్నాయా? మీడియా అనవసరమైన ఆర్భాటం చేస్తున్నదా?" - ఇవన్నీ మనకు ఎదురయ్యే ప్రశ్నలు. స్త్రీ, పురుషుల మధ్య ఏవో కొన్ని అవాంఛిత సంఘటనలు జరగటం ఆది నుంచీ ఉండినట్టిదే కావచ్చు. కానీ, తనకు లొంగని స్త్రీని బాధించేవాడు, పరస్త్రీని కాంక్షించేవాడు, స్త్రీని అగౌరవపరచి కక్ష తీర్చుకునేవాడు - వాడెంతటివాడైనా సరే - సర్వనాశనమైపోతాడని మన ఇతిహాసాలు, గ్రంథాలు, శాస్త్రాలు అన్నీ ఘోషిస్తూ వచ్చాయి. అలా చేసేవారు రాక్షసులని పిలవబడ్డారు. తత్ఫలితంగా ప్రజలలో కొంత పాపభీతి, దైవభీతి నిలచి, దోషాలకు అడ్డుకట్ట వేసాయి. వేదకాలం నుంచీ మహా విదుషీమణులు, వీరవనితలు, గణితాది శాస్త్రాలలో నిష్ణాతురాండ్రైన స్త్రీలు మనకున్నారు. ఆనాడు ఇంతటి హీనపరిస్థితులు లేవు. మరి, ఇప్పుడెందుకు వచ్చాయి?

మారుతున్న విద్యా విధానం, ప్రపంచీకరణ పేరిటా-విజాతీయుల ద్వారానూ మనకు దిగుమతి అవుతున్న విపరీత వేషధారణ, అతి చనువులు, లోపించిన కుటుంబ బంధాలు, దొరతనం వారి అనుమతితో(?) విడుదలయ్యే చలనచిత్రాలు, పత్రికలు, మరీ ముఖ్యంగా టి.వి-యివన్నీ యీ ఉత్పాతాలకు కారణాలవుతున్నాయి.

దేశ, కాల, వాతావరణాలకు అనుగుణంగా మన వేషభాషలుంటాయి-ఉండాలి. అతి శీతల దేశాల్లోను, శీతల దేశాలలోను పరస్పర స్పర్శ స్త్రీ, పురుషులలో ఆట్టే ప్రకంపనాలను సృష్టించదు. కానీ, సాభిప్రాయమైన ఒక్క చూపు, ఒక మాట కూడా మానసిక స్పందనను కలిగించగలగటం మన దేశపు తీరులోనే ఉన్నది. ఇక రాసుకుపూసుకు తిరగడాలు ఎటు





దారితీస్తాయో చెప్పాలా? ఏకాంతాలు, సెల్‌ఫోన్లలో గంటల తరబడి ముచ్చటలు, కవ్వింపులు ఏం చేస్తాయి? వీటికితోడు మన పత్రికల్లో ముద్దులు, కౌగిలింతలు ఎంతో మంచివనీ, ఆరోగ్యకరమనీ సశాస్త్రీయంగా చెప్పినంత బల్లగుద్ది చెప్తున్నారు. "అబద్ధాలాడకూడదు, దొంగతనం తప్పు" అని మనకు పసితనం నుంచీ నూరిపోస్తారు. ఎందుకు? వినగా వినగా అవి జీర్ణమైపోవాలని. అలాగే చిన్ననాటినుండీ రకరకాల అర్ధనగ్న, ముప్పావు నగ్నస్త్రీలను, కామక్రీడలను పత్రికల ద్వారా, సినిమాలు, టి.వి.ల ద్వారా చూపించగా చూపించగా ఏమవుతుంది? అవి బలంగా ముద్ర వేసుకుపోతాయి మెదళ్లలో. యుక్తవయస్సు వచ్చేసరికి సహజ శారీరక స్పందనలకు యీ భావాలు తోడైతే ఆ కుర్రవాళ్లు పరస్త్రీని తల్లిగా, చెల్లిగా చూడగలరా? బండగా చెప్పాలంటే తల్లిలో, చెల్లిలో కూడా ఆడదాన్నే చూస్తారు. వాళ్ల కోరికో, వాళ్లను ఆవరించిన వైకల్యమో తీరే దారి దొరక్కపోతే-పసిపిల్లల మీదా, ముసలవ్వల మీదా కూడా తమ ప్రతాపం చూపడానికి వెనకాడరు. ఈ పాపం అంతా మాస్ మీడియాదే.

ఇందాకే అనుకున్నాం వేషమూ, భాషా కూడా దేశకాలాలకు తగినట్లుండాలని. తల్లినీ, కూతుర్నీ, చెల్లెల్నీ, దేశాన్నీ-చివరికి కూరగాయలమ్మే మనిషినైనా సరే 'అమ్మా' అని సంబోధించి మాట్లాడే యీ గడ్డ మీద 'నీయమ్మ, నీ యక్క అనేవి ఊతపదాలుగా మారిపోయాయంటే కారకులెవరు? ప్రజానీకంలో వాడుకలో ఉన్న భాషలో తగిన సంస్కారాలను ప్రవేశపెట్టవలసిన రచయితలు-తమకు అందుబాటులో ఉన్న బూతుకూత లన్నిటినీ కథల్లో, సినిమా డైలాగుల్లో ప్రవేశపెట్టటం వలన ఏమవుతున్నది? ఆ బూతులు రాష్ట్రమంతటా పాకిపోయి స్త్రీలను అవమానిస్తూండటం అత్యంత సహజమైపోతుంది-పోయింది. ఎయిడ్స్ రోగానికి మూలాలు ఏమిటో వివరించి చెప్పి, అనైతిక బంధాలను అరికట్టవలసి ఉండగా- మన దొరతనం వారు హైస్కూలు పిల్లలకు కూడా కండోమ్‌లిమ్మని సెలవిచ్చాను.

‘పులిరాజా’ ఎడ్వర్‌టెయిజ్‌మెంట్లద్వారా ఒకానొక దరిద్రపుకల్ట్‌కు తెరదీసారు.

మన న్యాయవేత్తలు సహజీవనానికి క్లీన్ సర్టిఫికెటిచ్చారు. పబ్బులకీ, క్లబ్బులకీ స్వేచ్ఛగా బ్రతకమని పర్మిట్లిచ్చారు. బీచ్ వాలీబాల్‌ల పేరిట నగ్న ప్రదర్శనలు ప్రోత్సహించారు. సినిమాలలో పైనో పీలికా, క్రింద డ్రాయర్ కంటె కొన్ని అంగుళాల పొడవు మాత్రమే ఉన్న దరిద్రపు డ్రెస్‌లు వేసుకొని నటించడాన్ని, అతి వేల శృంగారాన్ని ప్రదర్శించడానికి సెన్సార్ సర్టిఫికెట్లిచ్చారు. ఇవన్నీ యువతలో ఎలాటి భావాలు రేకెత్తిస్తున్నాయి?

ఇక మన ఆడపిల్లలు-అంటే మీదబడి కరుస్తారుగానీ-స్నేహానికీ, కామానికీ సరిహద్దులు చెరిపేసుకొంటున్నారు. “మా డ్రెస్సు-మా యిష్టం” అంటున్నారు. బావుంది. మరి మగవాళ్లు ఉత్తి అండర్‌వేర్లతో తిరిగితే సహించగలరా? ఒక జీవిని సృష్టించి వెలికితేవటం, ఆ జీవికి పాలిచ్చి పెంచటం, ఆ జీవి తన కడుపులో ఉన్నపుడు ఆహారాన్ని సప్లై చేయటం-యివన్నీ పరమాత్మకు ప్రతినిధులుగా తాము చేసే పవిత్రకార్యాలు. ఆ పనులకుపకరించే స్థానాలను ఎంతో గౌరవంగా, పదిలంగా దాచుకోవలసి ఉండగా-ప్రదర్శింపబూనుకోవటం తగిన పనేనా? తండ్రితో, అన్నదమ్ములతో, కొడుకుతోనైనా సరే ఒకే శయ్యపై కూర్చోరాదని నియమించిన వారు మూర్ఖులు కారు. దేశ, కాల, వాతావరణాలను గుర్తెరిగిన ధర్మమూర్తులు. మన దేశానికి నమస్కారమే సరైనదిగానీ ‘షేక్ హేండ్’ కాదని గ్రహించిన వారు. ఫ్రెండ్‌షిప్ పేరుతో స్కూటర్‌పై ఎక్కి మీదికి వాలిపోవటాలు, అర్ధ రాత్రి ఆడ, మగ ఫ్రెండ్స్ సినిమాలకో, పార్టీలకో తిరగడాలు అత్యవసరం కాదనీ, అవి పతనానికి దారితీస్తాయనీ తెలిసినవారు. ఆడవాళ్లంటే యీ దేశపు ఆడపడచులు. వారు తమ సోదరులను రెచ్చగొట్టే మాదిరి వస్త్రధారణతో, అతి చనువు, కవ్వింపులతో వారిలోని మృగత్వాన్ని పెంచి, భ్రష్టత్వానికి దారిచూపటం దోషం కాదంటారా?

పురుషులకు యీ సమాజం సర్వహక్కులూ ప్రసాదించింది నిజమే.





అలా అని యథేచ్ఛగా ప్రవర్తించి, కొన్ని జీవితాలు నాశనం చేసే హక్కు మాత్రం లేదు. అలా ప్రవర్తిస్తే దాని దుష్ఫలితాలు వారి కుటుంబం మీద, వారి మీద కూడా పడక తప్పదు. జీవితం మూడు వంతులు గడిచాక వెనక్కు తిరిగి చూచుకొంటే సిగ్గుతో, పాపం చేసానన్న బాధతో కుమిలి పోనక్కరలేని విధంగా జీవించాలి మనిషి. ప్రేమని కొనుక్కోలేరు, డిమేండ్ చేసి సంపాదించుకోలేరు, భయపెట్టీ పొందలేరు. నిజంగా ప్రేమ ఉంటే-అవతలివారు ఆనందంగా జీవించాలని కోరుకోవాలే తప్ప-నాకు దక్కనిది నశించిపోవలసిందేనన్న మదం, రాక్షసత్వం ఉంటే వాడు ప్రేమికుడూ కాడు-అసలు మనిషే కాడు.

మరి-యీ పరిస్థితిని మార్చటం ఎలా? కేవలం శిక్షలతో యివి ఆగవు. నిర్భయ చట్టం వచ్చినా ఆగాయా? పాతరోజులలోలాగా విద్యా విధానంలో నైతిక విలువలు ప్రవేశపెట్టాలి. పెద్దలు మన ఇతిహాసాల వంటివి చెప్పటం ద్వారా మన సంస్కృతి గాఢంగా పిల్లల్లో నాటుకొనేలా చెయ్యాలి. ఎంతటి స్నేహాలకైనా ఒక హద్దుండాలని చెప్పాలి. వస్త్రధారణలో, ఇళ్లకు చేరటంలో సమయపాలనలో పద్ధతి నేర్పాలి. కెరీర్‌కన్నా-స్టైల్స్‌కన్నా- జీవితం చాలా విలువైనదని తెలియజెప్పటం-ముఖ్యంగా సెల్‌ఫోన్‌లు, నెట్‌లు, ఫేస్‌బుక్‌లు, చాటింగ్‌లు వగైరాలు ఆధునిక ప్రపంచంలో ఎంత వరకు అవసరమో అంతవరకేగానీ అవే జీవితమార్గాలను నిర్దేశించేవి కాకూడదని చెప్పటం అవసరం. సినిమా దుస్తులపైన ప్రభుత్వం వారు కూడా కొన్ని నియమనిబంధనలను పెంచాలి. అన్నిటినీ మించి కొంపల్లోకే వచ్చి కూర్చుని మరీ కొంపలు కూలుస్తున్న టి.వి. పోకడలను నిర్మొగమోటంగా నియంత్రించాలి. విలాసం కన్నా జీవితం గొప్పదని పదేపదే యువత గుర్తు చేసుకోవాలి.

అయ్యా, మనకు గంగ తల్లి, గోవు తల్లి, స్త్రీ తల్లి, దేశం తల్లి. ఇప్పుడు గంగను కలుషితం చేసాం-గోవును కోసి తింటున్నాం - స్త్రీని చెరబడుతున్నాం. ఇక దేశం ఏమవుతుంది? తండ్రులారా ఆలోచించండి. తల్లులారా ఆలోచించండి.

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

(గత సంచిక తరువాయి)

### ఏ కొంచెమైనా గొప్పే ...

చివరిగా ఒక్కమాట. మారుతున్న ప్రపంచరీతిని చూస్తూ చూస్తూ 'సేవ' అనే మాట కొంత అవహేళనకు గురిఅవుతున్నది. సేవ అనేమాట అడ్డం పెట్టుకొని స్వార్థం కోసమే పనిచేస్తారని కొందరనుకుంటే సేవకులన్నవారు గంభీర ప్రశాంతంగా, ఏదో మహాయోగుల్లా ఉండాలనీ, ఎవరేమనుకొన్నా- అన్నా కూడా కిమ్మనకుండా చేస్తూ ఉండాలనీ యింకొందరు అనుకొంటారు. ఇవి రెండూ తప్పే. ప్రశాంతంగా, నిర్లిప్తంగా పనిచేసు కుంటూ పోగలగటం గొప్ప విషయమే. కానీ, ఆ స్థాయికి వెళ్లేలోపల సేవకులలో కొన్ని లోపాలు, ఒడిదుడుకులు ఉండటం సహజం. వాటిని అధిగమించడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉంటాయి. అది బయటి వారికి అర్థం కాకపోవచ్చు.

అలాగే సేవకు వచ్చే వారంతా స్వార్థపరులనుకోవటం కూడా అవివేకమే. పది రూపాయలు దొరుకుతాయంటే మాట తప్పే ... మాటేమిటి ధర్మపు గీటు కూడా తప్పే మనుషులు తామరతంపరగా వర్థిల్లే యీ ప్రపంచంలో - ప్రతిఫలం ఆశించకుండా ఏదో ఆరాటంతో, చింతనతో ఎంత చిన్న సేవ చేసినా గానీ - అది ఫలాపేక్షతో చేసిన దానికన్నా నిర్ద్వంద్వంగా, ఖచ్చితంగా గొప్పదే. అంచేత అలా మూర్ఖంగా ఎవరైనా హేళనగా అన్నా సేవకులు పట్టించుకోనక్కర లేదు.

ముగింపు మాటగా ఒక విన్నపం.

నేడు దేశమాత ఉన్న దశలో అనేకానేక మంది సంస్కారవంతులైన, దయార్ద్ర హృదయులైన సమాజసేవకుల అవసరం ఉంది. కదలండి -






తరలి రండి - సాయీ స్వరూపమైన సమాజ పరమేశ్వరుని సేవిద్దాం. మన జన్మను సఫలం చేసుకుందాం. శ్రీ సాయిదేవుల చరణాల మ్రోల రవ్వంత చోటు సంపాదించుకొందాం.

**ఓం శ్రీ సచ్చిదానంద సమర్థ సద్గురు**

**సాయినాథ మహారాజుకు జై!**

**(సమాప్తం)**




# అర్హత

**- శ్రీ రమణ భగవాన్**

"చూడండి - ఆ కుక్కలు నేను ముందుగా తింటేగానీ అవి ముట్టవు" అన్నారు రమణులు చెట్టు క్రింద ఉన్న నాలుగు కుక్కలను చూపిస్తూ.

ఒక పండితుడు పరీక్షించాలనుకొని ఆ కుక్కల ముందు నాలుగు లడ్డులు పెట్టాడు. అవి కనీసం వాసన కూడా చూడలేదు. కొంత సేపయ్యాక రమణులు అవి చూస్తుండగా లడ్డు ముక్క చిన్నది తమ నోట్లో వేసుకున్నారు. మరుక్షణమే నాలుగు కుక్కలూ లడ్డూలు స్వాహా చేసేసాయి. పండితుడు తెల్లబోయాడు. అంతలో ఒకరెవరో రెండు నెమళ్లు తెచ్చి భగవాన్ సన్నిధిన వదిలారు. అవి అక్కడ ఉండక పారిపోతున్నాయి. మళ్లీ తెస్తే మళ్లీ పారిపోతున్నాయి. అది చూచి రమణులు చిరునవ్వుతో "ఇక్కడ ఉండటానికి అర్హత కావాలి. ఆ నెమళ్లకు అర్హత లేదు" అన్నారు.

మరో రోజు (1930లో) తిరువాన్కూర్ యువరాజు భగవాన్‌ను దర్శించి "భగవాన్! తమరు బోధిస్తున్న విచారణా మార్గాన్ని అనుసరించ డానికి కనీస అర్హతయినా నాకు లేదు. అట్టి అర్హత ప్రసాదించండి" అని ప్రార్థించారు. అందుకు భగవాన్ అనుగ్రహపూర్వకంగా చూచి "అర్హత ఉన్నది గదా! ఆ అర్హతే నిన్ను నా దగ్గరకు తెచ్చి భక్తి కలిగేలా చేసింది. అదే నీకు గల అర్హత". అన్నారు.



# షిర్డీసాయి చరితము

## గేయమాలిక

రచన : శ్రీ జయంతి భద్రం

(గత సంచిక తరువాయి)

4. చిరిగిన గోనియె సింహాసనము, వెలిగే ధునియే అగ్నిహోత్రము
కఫనీ, పాగా ధరించి సాయి, ఫకీరుగానే జీవించే
అహంకార మమకారమ్ములను, ధునిలో వేసి ఆహుతి చేస్తే
లభించు నిర్మల విభూతియే, ముక్తి మార్గ సోపానము
-శ్రద్ధ, సబూరి అర్పణజేసే భక్తుల కొసగును మోక్షమూ....(2)॥సాయి॥

5. ఆత్మయోగిగా, ఆనందముతో, యోగ సమాధిలో ఉండేవు
షిర్డీ జనుల చింతలు తీర్చుచు, భక్తి మార్గం బోధించేవు
హిందూ ముస్లిం భేదము లేదని, సమరస భావన నెలకొల్పేవు
మతముల కన్నా, మానవత్వమే, గొప్ప మతమని చాటేవు
- సచ్చిదానంద సమర్థ సద్గురు సాయినాథునిగ, మముబ్రోచేవు(2)
॥సాయి॥

6. కలరా జాడ్యము పారద్రోలుటకు, గోధుమ పిండిని చల్లమనేవు
ఉగ్రమైన పెను తుఫానునైనా, నీ గర్జనతో చల్లార్చేవు
నిత్యము విసిరే తిరుగలి లోన, నశింపజేతువు పాపములు
నిన్ను నమ్మిన భక్తులందరికి, తొలగును మనోవిచారములు
-నీ పాదుకలను ఆశ్రయించుటే జీవన్ముక్తికి మార్గమూ...(2)॥సాయి॥


7. నూనెకు బదులుగ నీటిని పోసి, దీపములే వెలిగించేవు
కొలిమిలో బడిన కమ్మరి బిడ్డను చేయి పెట్టి రక్షించేవు
గుడ్డ పీలికల ఊయలపైనా యోగివలె శయనించేవు
పాదములంటిన దాసుగణునికి గంగా యమునలు చూపేవు
-త్రివేణి సంగమ స్నానఫలితమే నీ పదపద్మమ్ముల దొరికేనూ..(2)॥సాయి॥

(సశేషం)





# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

ఆ రాత్రి గజానన మహారాజుల వారు ఆ పరివ్రాజకులకందరికీ సన్యాస ధర్మాలు వివరించారు.

వారు ఇలా అన్నారు. "ఒంటినిండా భస్మధారణ చేసి కాషాయాలు ధరించి, రుద్రాక్షలు వేసుకొని తిరిగేవారు లోక వ్యవహారాల్లో పూర్తి నిర్లిప్తులుగా ఉండాలి. కొన్ని శాస్త్ర గ్రంథాలు బట్టీపట్టి అనర్గళంగా ఉపన్యసించే వాచావేదాంతం పనికిరాదు. వేదాంత విషయాలను అనుభూతి పొందిన తరువాతనే ఇతరులకు బోధించటానికి ఉపక్రమించాలి. అనుభూతి పొందకుండా ఉపన్యాసాలు చెప్పటం కపటమూ, ప్రజలను మోసగించటమూ అవుతుంది.

మన మహనీయుల పరంపరను గుర్తుకు తెచ్చుకోండి మచ్ఛీంద్రనాథుడు, జాలంధరనాథుడు, గోరఖ్‌నాథుడు, గహనీనాథుడు, జ్ఞానేశ్వర మహారాజు-వీరంతా సత్యాన్ని దర్శించారు. మహాత్ములైన జగద్గురువు ఆది శంకరాచార్యులు రూపు ధరించిన సత్యమే కదా! సత్యమే పరమాత్మ. జ్ఞాని, కర్మయోగి, ధర్మస్థాపకుడూనైన సమర్థ రామదాస స్వామిని గుర్తుకు తెచ్చుకోండి. వారు విశ్వాత్మను ఆవాహన చేసుకొన్న నిరాడంబరులు. ఏకనాథ స్వామి గృహస్థాశ్రమంలో ఉన్నట్లు కన్పించినా సత్యాన్ని దర్శించిన మహనీయుడు. వీరందరినీ నిరంతరం స్మృతిలో ఉంచుకొని వారు చూపిన మార్గాన్ని అనుసరించండి. పాదదక్షిణల కోసం, పూరీ హల్వాల కోసం యీ విధంగా దేశాలు పట్టి తిరగకండి.

తెల్లవారుఝామునే బ్రహ్మగిరి లేచి ఒంటరిగా ఎటో వెళ్ళిపోయాడు.

(సశేషం)

ఓం శ్రీ సాయిరాం



# షిరిడీ డైరీ

– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే

**అనువాదం : మాతా శుకవాణి**

(గత సంచిక తరువాయి)

29-01-1912

ప్రొద్దున్న లేచి ప్రార్థనానంతరం కొంచెం ముందుగానే కాకడ హారతికి వెళ్లాను. తిరిగి వచ్చి మామూలు దినచర్యలో పడిపోయాను. తొమ్మిది గంటల వేళ బాపూసాహెబ్ జోగ్ యింటికి వెళ్లి ఉపాసనీ, నేను, అతను కలిసి పరమామృతం ప్రారంభించాం. కానీ, నాకు నిద్ర ముంచుకు వచ్చింది. ముందుకు సాగలేకపోయాను. చివరికి తిరిగి వచ్చి పడుకొన్నాను. పన్నెండున్నర, ఒంటి గంట వరకూ లేవనే లేదు. మాధవరావు, ఇంకా వేరేవారూ పెద్దగా అరిచిమరీ లేపే ప్రయత్నం చేసినా నాకు తెలియలేదు. చివరికి వాళ్లంతా హారతికి వెళ్లారు. బాబా నా నిద్రగోల విని, లేపవలసిందన్నారట. చివరికెలాగో లేచి హారతి చివరి భాగం నడుస్తుండగా వెళ్లాను. అంతసేపు నిద్రపోయి నందుకు సిగ్గుపడ్డాను. మిగిలిన రోజంతా నిద్రమబ్బుగానే ఉంది. నారాయణరావు బామన్‌గాంవ్‌కర్ షోలాపూరు నుంచీ వచ్చాడివ్వేళ. ఆయన మంచి యువకుడు. ఆయనతో మాట్లాడుతూ కూర్చున్నాను. తరువాత దీక్షిత్ పురాణానికి హాజరయ్యాను. తొమ్మిది పది గంటల మధ్య బాబా నడకకు వెళ్లటం చూచి వెళ్లి దర్శనం చేసుకున్నాను. సాయంత్రం భీష్మ భజన, అటుపైన దీక్షిత్ రామాయణం యథావిధిగా సాగాయి.

30-01-1912

పెందలకడనే లేచాను గానీ మళ్లీ నిన్నటిలాగే నిద్ర ముంచుకువస్తుందేమో నన్న భయంతో పక్క వదలలేదు. తెల్లవారే ముందు లేచి ప్రార్థన చేసుకొని, పరమామృత్ క్లాసుకు వెళ్లాను. ఉపాసనీ, శ్రీమతి కౌజల్గీ, బాపూ సాహెబ్ ఉన్నారందులో. బాగా ముందుకు నడిచింది. సాయిబాబా బయటికి వెళ్లటం,





తిరిగి రావటం చూచాము. ఆయన మసీదులో ఆ వేళ ఉదయం ఎలా గడిపానో అడిగి తెలుసుకొన్నారు. మధ్యాహ్నహారతి, భోజనాల తరువాత దీక్షిత్ రామాయణం చదివితే భీష్మ, మాధవరావ్ దేశ్‌పాండే కూడా విన్నారు. సీతారాం డేంగ్లే తమ్ముడు, మరిద్దరు గ్రామీణులు వచ్చి మేము చదువుకోవటం పూర్తయ్యాక మాట్లాడుతూ కూర్చున్నారు. వాళ్లలో ఒకరు రామాయణం ఛందోబద్ధంగా చదివారు. అప్పుడు నేను సాయిబాబాను చూడటానికి వెళ్లాను. ఆయన "మధ్యాహ్నం ఎలా గడిపావ"ని అడిగారు. నేను ఉత్తరాలు వ్రాసానని చెప్తే "సోమరిగా కూర్చోవటం కంటె ఏదో పనిలో చేతులు కదలటమే మంచిది" అన్నారు. తిరిగి సాయంత్రం వాహ్యాళి సమయంలోనూ, శేజారతి సమయంలోనూ ఆయన దర్శనమైంది. ఇవ్వేళ రాత్రి భజన లేదు. భాగవతం చదివాము. రాత్రి రామాయణం మామూలే.

31-01-1912

నేను కాకడహారతికి నారాయణరావు బామన్‌గాంవ్‌కర్‌తో కలిసి వెళ్లాను. సాయి మహరాజు మేము తిరిగి వచ్చేటపుడు కొద్దిగా కోపం చూపించారు. మా పరమామృతం క్లాసు బాపూసాహెబ్, ఉపాసనీ, శ్రీమతి కౌజల్గీలతో నడిచింది. చాలా చదివాము. విడిదికి 11 గంటలకు వచ్చి, కొన్ని ఉత్తరాలు వ్రాసే ప్రయత్నం చేసాను గానీ నాకు తెలీకుండానే నిద్రపోయాను. దాదాకేల్కర్ కొడుకు భావూ నన్ను నిద్రలేపితే మధ్యాహ్నహారతికి వెళ్లాను. సాయిమహరాజ్ బయటికి వెళ్లటం అంతకుముందే చూచాను. హారతి మామూలుగానే జరిగిపోయింది. ఆ రోజుకి మేఘా చనిపోయి 13వ రోజు. ఆ స్మృతితో దాదాకేల్కర్ మా వాడాలో వారినీ, యింకా కొందరినీ భోజనాలకు పిలిచాడు. భోజనాలు సహజంగానే ఆలస్యమవుతాయి గనుక నేను హాయిగా నిద్రపోయాను - నన్ను పిలిచేవరకూ. భోజనాల య్యేసరికి సాయంత్రం 5 గం.లు అయింది. బాబా దగ్గరికి మసీదుకు వెళ్లి కూర్చున్నాను. ఆయన చాలా ప్రసన్నంగా ఉన్నారు. ప్రసన్నంగా మాట్లాడారు- పాడారు- నాట్యం చేసారు- మా అందరికీ గోకులంలో కృష్ణుడిని గుర్తు చేసారు. సాయం వాహ్యాళికి వెళ్లేటపుడు మళ్లీ సాయి దర్శనం అయింది. వాడా హారతి తరువాత కొద్దిగా భజన, రామాయణ పఠనం జరిగాయి. సుందరకాండ పూర్తయింది యీ రాత్రి.

**(సశేషం)**

## స్వరాంజలి

# ఎంతైనా సైపగలను

– శ్రీ మధురాపంతుల రాజగోపాలరావు

ఆంతర్యంలో నీవుంటే
ఎంతయినా సైపగలను సాయీ ॥ఆం॥
దుఃఖమో సుఖమో నాకేమీ
వానితో నాకు పని ఏమీ
ఎగిరే పక్షీ,
సాగే వాగూ - చేసేనా ఏమైనా ॥ఆం॥
ఇచ్చేవాడివి నీవు
మాపై ఉన్నది కరుణ
చిన్నో పెద్దో ఏమైనా
నే కోరాలా ఏదైనా
గనిలో వజ్రం,
శుక్తిలో ముత్యం ఏదైనా అడిగేనా ॥ఆం॥
నా మంచి కోసమే
క్షణక్షణమూ నీవుంటే
నా భాగ్యానికి లోటేమీ?
నా యోచనతో పని ఏమీ -
మొగ్గలో పువ్వూ,
గూటిలో చిలకా ఏమైనా కోరేనా ॥ఆం॥
చేయిపట్టి ప్రతి పనీ
చేయించేది నీవైతే
నా సహనంతో పని ఏమీ?
చింతా వంతా నాకేమీ -
గింజలో మొలకా,
గుడ్డులో పిట్టా వెలికిరాగా తపనేలా ॥ఆం॥







# లేఖావాణి

వేంకటాద్రి హిల్స్,

06, జనవరి, 2015

సత్యం, సత్యపదం, ఆనందం మూడూ కలసిన
పరమపూజ్యులు - మమ్ము తరింపజేయవచ్చిన
శ్రీశ్రీశ్రీ ప్రభుజీవారి పాదపద్మాలకు వేవేల నమస్సులు.

తాము స్థాపించిన వరదసాయి మందిరం ద్వారవతి, సాయిధామం ఆశ్రమం ఇంతకు నూరింతలుగా వర్థిల్లుగాక!

అమ్మలగన్న అమ్మలాగ దీక్షతో గురుదేవుల వెనుక నిలచి కష్టనిష్ఠురాలకు ఒడిపట్టినిలచిన మా తల్లి 'శుకవాణి' మాతాజీకి నా ఆశీస్సులు తల్లీ! అమ్మా, నాకిపుడు ఎనిమిదిన్నర పదులు నడుస్తున్నాయి. అరవై ఏళ్లుగా ఎన్నో ఆశ్రమాలు, మఠాలు, ముక్తిధామాలు, క్షేత్రాలు దర్శించాను. కాని, మన సాయిధామంలో పాడి గోవులు, పసిబిడ్డలు, వారిని పెంచే దయామయులు, గడ్డివాములు, రోజూ చల్ల చిలికే శబ్దాలు, వృద్ధమాతలు, పాఠశాల, ఆలయాలు, సత్సంగాలు.,.,.. ఎల్లవేళలా ఏదో ఒక కార్యక్రమం, అన్నదానం .... నిత్యోత్సవంగా ఉండే ఆశ్రమం. ఇది నాకు నా పుట్టింటినీ, అరవై ఏళ్లనాటి మన గ్రామాలను తలపింపజేసి, మనసు పులకించింది. అక్కడే ఉండిపోవాలనిపించింది. కానీ, బాబా ఆజ్ఞ కాలేదు. ఏదో కొందరితో సాయివాణికి చందాలు, అంతో యింతో అన్నదానాలకు కట్టించటంతో నా సేవ ఆగిపోయింది.

అమ్మా, పేరు వస్తుందనో - ప్రభుత్వం నుంచీ గ్రాంట్లు వస్తాయనో - పదుగురినీ పోగేసిన ఆశ్రమం కాదిది. మట్టిదారులు, లైట్లు లేని వీధులు,

గీజురుమనే అడవి - తొలిరోజులు నాకు బాగా గుర్తున్నాయి. బాబా లీలలు ఎక్కడో చూడనవసరం లేదు. ఆధ్యాత్మికంగా వికసించే మనసుంటే ఆ గడ్డ చాలు - అణువణువునా బాబానే కనిపిస్తారు.

సాయివాణి తప్పకుండా అక్షరాక్షరం చదువుతాను ప్రతినెలా. కదిలే బొమ్మలను కళ్లతో చూస్తూ, చెవులతో వింటున్నంత స్పష్టంగా, ఎంతో ఆకర్షణీయంగా వ్రాస్తారు మాతృసంస్థ కబుర్లు. బాబా వారి గురించి, దేశం గురించి, సత్సంగాల గురించి, మంచితనం, సేవల గురించి - ఎన్నెన్నో విషయాలు చక్కగా విశదంగా వ్రాస్తారు. ఈ వయసులో - నా అదృష్టంకొద్దీ యింకా యివన్నీ చదవగలుగుతున్నాను. పాతికేళ్లుగా యీ పత్రిక యిలా తెస్తూ మా వంటి వారికి ఆధ్యాత్మిక వెలుగులు అందిస్తున్న మీకు, మిమ్మల్ని నడుపుతున్న గురుదేవులకు ఏమివ్వగలను తల్లీ! మరో నూరేళ్లు యీ పత్రిక నిలచి వర్ధిల్లుగాక- అని సాయిని ప్రార్థించటం తప్ప!

అమ్మా పసిపిల్లలకు, బుజ్జాయిలకు, గోమాతలకు, నందీశ్వర బసవేశ్వరులకు, గోపాలురకు, పిన్నలకు, పెద్దలకు, చి॥ రాంబాబుకు అందరికీ నా ఆశీస్సులు తల్లీ!

**ప్రేమాభిమానాలతో,**

**మీ**

సాయి మామ్మగారు

(వరలక్ష్మి వెంకటరావు జి.)

(నా కడపటి క్షణాలలో ఫోన్ చేయిస్తాను మీకు. 'సాయిరాం' అని స్మరింప జేయండి తల్లీ! ఆ ధన్యత చాలు నాకు)





# మాతృసంస్థ కబుర్లు

జనవరి 1వ తేదీ ఒక విశిష్టమైన రోజుగా వచ్చింది 2015లో. ఆ రోజు ఆంగ్ల సంవత్సరాది, వైకుంఠ ఏకాదశి (ఉత్తర ద్వార దర్శన పర్వదినం), గురువారం కలిసి వచ్చాయి. అంచేత భక్త జన సందోహాలు ఆలయాలలో పోటెత్తాయి. ఇక సాయి దేవాలయాలు సరేసరి. సత్తెనపల్లి లోని శ్రీ కోదండరామ సాయి సన్నిధానంలో ఏటా కోదండ రామస్వామి సందర్శనానికి మూడున్నర వేలకు పైగా - ఉషోదయాత్పూర్వమే ప్రారంభమై పన్నెండింటిదాకా ప్రవాహం సాగుతుంటుంది. అదిగాక యీ సంవత్సరం దాని కోసం గురుదేవులు, పాఠశాల ఉపాధ్యాయులు, రాంబాబు, మరి కొందరు అభిమానులు ఆ రోజు అక్కడికి వెళ్లటం అలవాటు. (శ్రీ సాయినాథుల వారు ఆనందసాయిగా కొలువుదీరారాయె క్రొత్త గుడిలో!) ఈ ఏడు కూడా అలాగే వెళ్లారు. అక్కడి పూజారి ప్రేమ్‌కుమార్‌గారు సాయిమందిరం లోను, రాంబాబుగారు రామాలయంలోను ఉత్తర ద్వారాల చెంత ఉండి కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు. శ్రీనివాస్, నరసింహ, బ్రహ్మారెడ్డి, రామయ్యగారు తదితర అభిమానులు ప్రసాద వినిమయం, గురుదేవుల చెంతకు భక్తులను క్రమంలో పంపటం వంటి విషయాలు సవ్యంగా ఉండేలా చూచుకొన్నారు. నాలుగు వేలకు పైగా భక్తులు ఈ పర్వదినాన స్వామి దర్శనం చేసుకొని ధన్యులైనారు.

శ్రీ సాయినాథ క్షేత్రంలో ప్రసన్నసాయికి కూడా ఉత్తర ద్వారదర్శనం, విశేషపూజలు జరిగాయి. వందలాదిమంది సాయిదర్శనం చేసుకున్నారు.

సాయిధామంలోని 'వరద సాయిని' వెయ్యిన్నర మంది దర్శనం చేసుకున్నారు. (ఉత్తర ద్వార దర్శనం, పల్లకి సేవ వేకువనే జరిగాయి) శ్రీ గోవిందరావుగారు, చిరంజీవి వంశీ కలిసి ఎడతెరిపి లేకుండా పూజలు చేస్తుండగా-అక్కయ్యలలో కొందరు వరుసగా ప్రసాదాలు చేసి పంపిస్తుం డగా-యింకొందరు ప్రసాద వినిమయం చేస్తుండగా - చిట్టి (సాయి

చంద్ర) భక్తులను లైన్లలో పంపుతూ సహకరించాడు. అలా నవ వత్సరం హడావుడిగా మా ఆశ్రమాల్లోకి వచ్చేసింది.

ధనుర్మాసమంతా సాయిధామం తీరుతీరుల ముగ్గులతో, కొప్పన గుమ్మడి పూలూ, చేమంతులూ పెట్టుకొని ముగ్గుల మధ్య-పసుపు కుంకుమలతో పూలపై కొలువుతీరిన గొబ్బెమ్మలతో కళకళలాడింది. భువనేశ్వరి రోజుకో క్రొత్త ముగ్గువేస్తుంటే చెల్లెళ్లు సాయం చేసారు. ఇంతలో ఆరునెలల పరీక్షలు వచ్చాయి. ఆ హడావుడి ఓ వారం. అమ్మయ్య! అయి పోయాయి! 9, 10 తేదీలలో జనవరి 26 ఉత్సవానికి ముందుగా ఆటల పోటీలు నిర్వహించారు. కబడీలు, కోకోలు, పరుగుపందేలూ వగైరాలు - చిన్ని చిన్ని గాయాలు, కేరమ్స్, ఛెస్‌లాంటి ఇండోర్ గేమ్స్, రకరకాల స్పోర్ట్స్ చిన్న పిల్లలకు, ముగ్గుల పోటీలు, పాటలు, పద్యాలు, వ్యాస రచనలు, వక్తృత్వాలు, కవితా రచనలు ఎన్నెన్నో పోటీలతో గడిచాయి. 11 నుండీ మా మామూలు కార్యక్రమాలు మొదలు- క్లీనింగ్, వాషింగ్ వగైరా వగైరాలు. భోగిమంట, పాయసాలతో భోగి నడిచిపోయింది. సంక్రాంతి విశేష పూజలు, కనుమనాడు గోపూజలు సంప్రదాయపూర్వకంగా నడిచాయి.

## పొరుగు సంస్థ కబుర్లు

పరమపూజ్య గురుదేవుల పట్ల భక్తి ప్రపత్తులు గల శిష్యుడు సత్తి దేవానందరెడ్డి-పాలమూరు వాస్తవ్యులు (తూర్పు గోదావరి జిల్లా) ఈయన పూర్వనామం దేవదానరెడ్డిని దేవానందరెడ్డిగా మార్చి, "నీకు దీక్ష ఉంది, భక్తి ఉంది. సాయి సత్సంగం ప్రారంభం చెయ్యి. అలా బాబా తత్త్వాన్ని పదు గురికీ పంచుతూ జన్మ సార్థకం చేసుకో" అని ఆశీర్వచనం, ఆజ్ఞ కలిపి యిచ్చారు. గుర్వాజ్ఞ శిరసావహించి వెంటనే సత్సంగాలు ప్రారంభించిన దేవానందరెడ్డిగారు పరిసర గ్రామాలలోను, దేవాలయాలలోను, వివిధ





భక్తుల ఆహ్వానం మేరకు ఉత్సవాల సందర్భంగానూ చక్కని క్రమశిక్షణతో, సమన్వయంతో సత్సంగ సప్తాహ నిర్వహణచేస్తూ చేస్తూ ఆ సంఖ్యను 108కి చేర్చారు. ప్రతి సత్సంగంలోనూ గురుపాదుకలు, వారి చిత్రపటం ఉంచటం మరచిపోరు. గురుస్తుతీ మరువరు. అనేక గ్రామాలలో సాయితత్త్వాన్ని అలా ప్రచారం చేస్తున్నారు. ఈనెల జనవరి 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు పాలమూరులోని సాయిమందిర ప్రాంగణంలో 108వ పారాయణ సప్తాహం నిర్వహించారు.

ఏడు రోజులపాటు జరిగిన యీ కార్యక్రమంలో నిత్యభజనలు జరిగాయి. వరుసగా కోటి విష్ణు సహస్ర నామపారాయణ, హోమ పూజలు, గీతా పారాయణ, అఖండ నామ సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణ, లలితా సహస్ర నామ పారాయణ, నగర సంకీర్తన, రోజుకొక్క అధ్యాయంగా సచ్చరిత్ర పారాయణ, సాయి చాలీసా పారాయణ, గోవింద నామ స్మరణ, రాత్రంతా భజనలు జరిగాయి. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామీణులంతా ఎంతో సహకారం అందించి, ఆయా రోజులలో విచ్చేసిన భక్తులందరికీ మంచినీళ్లు, కాఫీలు మొదలుకొని రెండు పూటలా భోజనాలతోసహా పరిపూర్ణమైన సౌకర్యాలు సమకూర్చారు.

500తో మొదలైన భక్తులరాక వెయ్యికి చేరుకొని ప్రాంగణమంతా కళకళలాడింది. ఎన్నెన్నో భజన బృందాలు, గ్రామగ్రామాల సత్సంగ సభ్యులు యిందులో పాల్గొన్నారు. మంగళవాద్య కారులు వీనులవిందు చేసారు. ఒక్కొక్కరోజు ఓ పెద్ద మేళాలాగా ఉత్సాహం వెల్లివిరిసింది.

పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానందప్రభుజీ వారి తరఫున సాయిధామం ఆశ్రమ ఉత్తరాధికారి శ్రీ కోదండ రామసాయి (రాంబాబుగారు) చివరి రోజు కార్యక్రమానికి హాజరైనారు. శ్రీశ్రీశ్రీ యోగి రాజ స్వామివారు కూడా (కోట కోటేశ్వరం) కూడా ఆశీస్సులందించారు. శ్రీ రామదాసు అమ్మగారు,, శ్రీ యలమంచిలి కృష్ణమూర్తి, శ్రీ సుబ్రహ్మణ్య

కృష్ణకుమారి, శ్రీ వెలగల సత్యనారాయణ, శ్రీ సత్తి రామకృష్ణారెడ్డి, శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు, శ్రీ చలపా సత్యనారాయణగారు, శ్రీ ఎం. భరత్‌రాజు - యింకా ఎందరెందరో తమ అద్భుత సహకారంతో యీ కార్యక్రమాన్ని సుసంపన్నం చేసారు. స్థానిక ఎం.ఎల్.ఏ. శ్రీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డిగారు, శ్రీ నల్లమిల్లి మూలా రెడ్డిగారు, మరికొందరు స్థానిక ప్రముఖులు కూడా యీ సప్తాహాన్ని దర్శించుకొన్నారు.

చివరిరోజున శ్రీ సాయినాథ వ్రతం నిర్వహించగా అందులోని కథల వివరణ రాంబాబుగారు చేసారు. భక్తులు ఆనందించారు. మధ్యాహ్నం శ్రీ సాయి ఊరేగింపు సేవ జరిగింది. పూర్ణాహుతి తరువాత శ్రీ దేవానంద రెడ్డిగారు మాట్లాడుతూ తమకు సహకారం అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమం యింత అద్భుతంగా జరగడానికి తమ గురుదేవులు శ్రీ ప్రభుజీ వారి ఆశీస్సులే కారణమని తెలిపారు. తమకీ మహద్భాగ్యం యిచ్చిన శ్రీ సాయిదేవులకు సాష్టాంగ నమస్సులర్పించారు. దేవానందరెడ్డిగారికి నిష్కామంగా, నిర్మలంగా యితోఽధిక సేవ లందించ గల శక్తి సామర్థ్యాలిమ్మని శ్రీ సాయిని ప్రార్థిస్తూ సాయివాణి ఆశీస్సులిస్తున్నది.

"నిజం బయలుదేరేలోపే అబద్ధం, ప్రపంచమంతా సంచరించి వస్తుంది" మనిషికి పొగడ్తలు ఎంత అవసరమో తిట్లు కూడా అంతే అవసరం. ఆ తిట్లే లేకుంటే నేను నలుగురికి తెలిసేవాడినే కాదు. పొగడ్తలు అత్యుత్సాహాన్ని ఇస్తాయి. తిట్లు మొదట బాధను ఇచ్చినా, ఆ తర్వాత మనలను ఆలోచింప జేస్తాయి. పట్టుదలను పెంచుతాయి. విజయం దక్కేవరకు నిలవకుండా చేస్తాయి.

**- ఎల్.ఆర్.సి. రెడ్డి**







# అలనాటి పులిలాగా...

**- మాతాజీ**

ఆ రోజు గురువారం 2014లో చివరి గురువారం. తోటలోని జామ కాయలు, సీతాఫలాలు, నేరేడు పళ్లు, మామిడికాయలు వంటివన్నీ ఆరగించడానికి పగళ్లు కొండముచ్చులు, కోతులు రావటం, రాత్రివేళల్లో అడవి పందులు వచ్చి తుంగముస్తెల కోసం తోటంతా తవ్విపోయటం ఆశ్రమానికి అలవాటైన అనుభవమే. అలాగే ఆరోజు ప్రొద్దున్నే మంచుపొర లింకా తొలగకముందే ఒక పెద్ద కోతి వచ్చింది. దాన్ని చూడగానే కుక్కలు మహోత్సాహంతో మొరగటం మొదలుపెట్టాయి. కోతి ప్రత్యూష భవనం మీదికి ఎక్కే ప్రయత్నంలో చెట్టు దిగింది. అది గోడ మీదికి ఎగురుతూండ గానే బ్రౌనీ (కుక్క) దాన్ని తుంటి మీద కొరికి క్రిందికి పడేసింది. అది చూచి పిల్లలంతా పరుగెత్తి కుక్కలను దూరంగా తోలేసారు. "పాపం! యీ కోతి ముసలిది" అన్నాడు చిట్టి దాని దగ్గరకు వెళ్లబోతూ, "కోతి తాతయ్య కరుస్తాడేమో అన్నా!" అన్నది హెచ్చరిక చేస్తూ సుధీర. చిట్టి అరటిపండూ, మందూ తీసుకొని ధైర్యంగా దగ్గరకు వెళ్లాడు.

కోతికి తగిలిన గాయం చాలా పెద్దది కాదు గానీ అది దీనంగా చూస్తోంది. చిట్టి మెల్లగా అరటిపండు చేతికిస్తే తినేసింది. చైత్ర అన్నం తెచ్చి పెట్టింది. అది తినలేదు. పరమాన్నం తెచ్చి పెట్టారు సుధ, భారతి. శుభ్రంగా తినేసింది. "కోతి తాతయ్యకు స్వీటంటే యిష్టం కాబోలు" అని పిల్లలంతా నవ్వారు. మరో పండిచ్చాడు చిట్టి-తినేసింది - అందరివైపూ తలలు తిప్పి చూస్తూ. "సరే! పాపం, దాన్ని కాస్త విశ్రాంతి తీసుకోనివ్వండి. కుక్కలు రాకుండా మాత్రం ఇద్దరిక్కడే ఉండండి. మిగతా వాళ్లంతా నడవండి" అంటూ మాతాజీ అందరినీ లోపలికి పంపించారు. కొంచెం సేపటితరువాత కోతి తాతయ్య చటుక్కున లేచి చకచక చెట్టెక్కేసి, ఓ

కొమ్మ మీద సెటిలైంది. "ఇక ఫర్వాలేదులే" అని ఎవరి పనుల్లోకి వాళ్లు వెళ్లిపోయారంతా.

మరో గంటకు గీతక్క వెళ్లి దానికేమైనా పెడదామని చూచింది. కాళ్లు క్రిందకు వ్రేళ్లాడేసి కొమ్మ మీద బోర్లగా పడుకొని ఉన్నది. ఆమె కేక వేస్తే చిట్టి వెళ్లి చూచాడు. కోతి తాతయ్య లోకం విడిచి వెళ్లిపోయాడు. పిల్లలంతా ఉసూరుమన్నారు. క్రిందికి దించారు. 'అయ్యో, అయ్యో' అంతా బాధపడ్డారు. కానీ అంతలోనే తేరుకున్నారు. "సాయి సచ్చరిత్ర"లో బాబా వారి ముందు పులి ఒకటి చచ్చిపోయింది గదా? అలా దీనికి కూడా ఏదో గత జన్మ భాగ్యం ఉండి ఉంటుంది. లేకపోతే గురువారం పూట - స్వామి ప్రసాదం మాత్రం (అన్నం తాకకుండా) తిని యింత అనాయాసంగా పోతుందా! బాధ ఉండి అరవటం, మూలగటం ఏమీ చెయ్యలేదు చూడండి. ధనుర్మాసంలో సాయి సన్నిధానంలో వెళ్లిపోయింది-ధన్యజీవి" అన్నారు మాతాజీ.

పిల్లలంతా కోతి తాతయ్య కోసం ఓ పెద్ద గొయ్యి తవ్వారు. గురుదేవులిచ్చిన విభూతి, ఉప్పు పోసి, పువ్వులు కోతి మీద చల్లారు. హనుమన్నామ స్మరణ చేస్తూ దానిని ఖననం చేశారు. స్నానాలు చేసి వచ్చి "హనుమాన్ చాలీసా" చదివారు. అలా కోతి తాతయ్య ధన్యజీవి అయ్యాడు.

ఈనాడు చదువులు పెరుగుతున్నాయి. కాని మనస్సులు కుంచించుకుపోతున్నాయి. మనుషులు మరీ సంకుచితులుగా తయారవుచున్నారు. స్వార్థపూరిత ఆలోచనలే. విశాల భావాల్ని పెంచుకోవాలి. విజ్ఞానముతోపాటే అజ్ఞానం పెరిగిపోతున్నది. నాటి త్యాగం, నీతి, నిజాయితీ, మానవ విలువలు మట్టికరిచిపోతున్నాయి. డబ్బుతోనే మనుష్యుల్ని కొలుస్తున్నారు. సంస్కృతి అనేది మనిషి ప్రవర్తనకు, జంతు ప్రవర్తనకు మధ్య నుండే సరిహద్దు గీత. సంస్కృతి నైతిక విలువలను కాపాడే గొప్పశక్తి. దాన్ని పోగొట్టుకొన్న జాతికి మనుగడ ఉండదు.

**- ఎల్.ఆర్.సి. రెడ్డి**







# మంగళాశీస్సులు



శ్రీ ఎస్.కె.లక్ష్మణరావుగారు చిరకాలంగా ఆశ్రమానికి సన్నిహితులు. జాయింట్ సెక్రటరీలలో ఒకరు. మంచి సేవాభావం, చక్కని సంస్కారం ఉన్నవారు. అనేక దశాబ్దాలుగా శ్రీ సాయి ప్రేమలో తరిస్తున్నవారు. వారి ఇల్లాలు శ్రీమతి ఇందిరాబాయిగారు, అన్నపూర్ణకు సాటి అయిన తల్లి. వారు తమ జ్యేష్ఠపుత్రుని జ్యేష్ఠపుత్రిక **చి॥సౌ॥ సాయిశ్రీకి చి॥ విజయ్‌బాబుతో 22వ తేదీ జనవరి-2015** నాటి ఉదయం గం.9.31ని. లకు హబ్సిగూడా (హైదరాబాద్)లోని ఎన్.జి.ఆర్.ఐ. కమ్యూనిటీ హాల్‌లో శాస్త్రోక్తంగా కళ్యాణమహోత్సవం నిర్వహించారు. విద్యావంతులైన యీ వధూవరులు పరస్పరానురాగంతో కలకాలం జీవించి, సత్సంతానవంతులై లోకోపకారులై జీవింతురుగాక! - అని పరమపూజ్య గురుదేవులు ప్రేమాశీస్సులు అందిస్తున్నారు.

ఎస్.ఆర్.కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రీ కొమ్ముల కృష్ణారావుగారు, శ్రీమతి శేషారత్నం దంపతులు గురుదేవుల పట్ల, ఆశ్రమం పట్ల ఎంతో గౌరవ ప్రపత్తులు గలవారు. ప్రగాఢమైన సాయిభక్తితో దశాబ్దాలుగా పునీతులవుతున్నవారు. ఇటీవల ఓ పెద్ద దేవాలయాన్ని తమ స్వగ్రామం పెదపట్నంలో నిర్మింపజేసారు కూడా. వారు తమ కుమారుడు **చి॥ వెంకట నాగేంద్ర** వివాహమహోత్సవం **చి॥సౌ॥ శ్రీరమ్యతో 24-01-15**నాటి ఉదయం 11 గంటలకు శివకోడు (తూర్పు గోదావరి జిల్లా)లోని కళ్యాణమండపంలో వైభవంగా నిర్వహించారు. ఈ నూతన దంపతులు విద్యావంతులు. కుటుంబ పెద్దల పట్ల, సమాజం పట్ల, దేశం పట్ల తమ కర్తవ్యాలను చక్కగా నెరవేరుస్తూ, ఒకే మాట, ఒకే బాటగా జీవించి సత్సంతానంతో వర్ధిల్లవలసిందిగా పూజ్యగురుదేవులు ఆశీర్వదిస్తున్నారు.

శ్రీమతి పుష్ప నాలుగేళ్లపాటు శ్రీ సాయి విద్యాధామంలో ఉపాధ్యాయినిగా పనిచేసారు పదేళ్ల క్రితం. ఆమె తన ఏకైక కుమారుడు **చి॥ శేషశరత్‌చంద్రపరిణయం చి॥సౌ॥ శ్రీవిద్యతో వరంగల్‌లోని శ్యామల గ్రాండ్ కళ్యాణమండపంలో 25.01.15నాటి రాత్రి గం.11.14 ని.లకు** శాస్త్రోక్తంగా నిర్వహించారు. వధూవరులు పరస్పరావగాహనతో, అనురక్తితో చిరకాలం జీవించి, సత్సంతతితో చల్లగా వర్ధిల్లాలని సాయిధామం తరపున గురుదేవులు తమ మంగళాశీస్సులు అందజేస్తున్నారు.



# నేను సాయివాణిని!



\- పుట్టగుంట సాయిరమణ

**నమస్కారం! నేను సాయివాణిని.**

నాకు పాతికేళ్లు నిండిన పుట్టినరోజు. నేను పుట్టి ఇరవై ఐదు సంవత్సరాలు అయినవా! అని నాకే ఆశ్చర్యమేస్తుంది. కానీ, ఈ ఇరవై ఐదు సంవత్సరములు నన్ను నడిపిన నా మిత్రులు చాలామందే ఉన్నారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా ఎప్పడూ వాళ్ళు ఓడిపోయి కూడా నన్ను గెలిపిస్తూ వచ్చారు. ఒక్కోసారి నేనంటే ఎందుకు వీళ్లకు ఇంత పిచ్చిప్రేమ అనుకుంటా నాలో నేనే. కానీ, అది పిచ్చి కాదు. ఈ సమాజాన్ని మార్చడానికి, హిందూ ధర్మాన్ని కాపాడడానికి, యువతను 'జాగ్రత్త సుమా'! అని హెచ్చరించడానికి వారందరూ కలిసిపడే తపన అని అర్థం చేసుకున్నా. ఒక్కోసారి మాతాజీ తాను వ్రాయలేక ఆరోగ్యం సహకరించకపోయినా, ఆసుపత్రిలో మంచంలో ఉన్నాసరే - నేను ఆగకూడదని పడిన తపన, చేసిన ప్రోత్సాహం మరువలేను. కన్నీరు వస్తున్నా నేను కన్నీరు కార్చి వారిని బాధపెట్టలేను. నేను సక్రమంగా మీ ముందుకు వస్తున్నానంటే ఎంతమంది నా వెనుక దన్నుగా ఉన్నారో మీకు తెలుసా? నాకోసం గౌరవ సంపాదకత్వం వహిం





చిన స్వామీజీ నన్ను ఎప్పడూ వదలలేదు. ప్రధాన సంపాదకత్వం వహించిన మాతాజీ నాకు అమ్మలాంటిది. ఎప్పడూ నాకు ఎక్కడా ఏ లోటూ చేయలేదు. వ్రాసే పనంతా వీళ్లదే అయినా (ఇటీవలి కాలంలో) నా ముద్రణ కోసం రామన్న పడే తపన వర్ణనాతీతం. ఎప్పడో ప్రొద్దున్నే ఇంత పొట్టలో వేసికొని, ఆ కారులో బయలుదేరి, నా కోసం ఆ ట్రాఫిక్‌లో, ఆ రణగొణ ధ్వనుల మధ్య నేను అచ్చయ్యే ప్రెస్ దగ్గరకొచ్చేసరికి పాపం, ఆ రాముని చూచి "నా కోసం ఎన్ని త్యాగం చేసావయ్యా!" అని నా కళ్లు చెమ్మగిల్లు తాయి. నాకు రంగులద్ది, నన్ను సక్రమంగా తీర్చి, నన్ను బయటికి పంపిస్తున్న శ్రీ వి.వి. కృష్ణారావుగారి సహకారం ఎప్పటికీ మరువను. డి.టి.పి. ధనలక్ష్మిగారు, చందాదారులను కంప్యూటర్‌లో లిస్ట్ చేసే శివప్రసాద్‌గారు- ఎందరో!

మరొకరున్నారండీ-వారే తనకు బరువని తెలిసినా, ఇది నా పని అని తన నెత్తిన ప్రచార సారథ్యం మోస్తున్న ఆనందం మామయ్య. సామాన్య భక్తుడి నుంచి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి వారికి నన్ను పరిచయం చేస్తుంటే నాలో నేనే పొంగి ఆనందంలో మునిగిపోయిన సందర్భాలు చాలా. వీరందరి కృషితోనే నేను నా పాతిక సంవత్సరాలు పూర్తి చేసుకున్నా. ఈ పాతిక సంవత్సరాల పండుగ సందర్భంగా మీ అందరినీ నేను అడిగే కానుక ఒకటే. "నన్ను చదవండి, చదివించండి, చదివి వినిపించండి. మీ సత్సంగాల్లో నాపై చర్చ జరపండి, నా ద్వారా దేశాన్ని, ధర్మాన్ని కాపాడండి".

మన నరేంద్ర మోడీగారు పిలుపునిచ్చారు "స్వచ్ఛ భారత్ అని, నేను పిలుపునిస్తున్నా "స్వచ్ఛ మనస్సు" అని. స్వచ్ఛమైన మనస్సుతో నన్ను చదవండి. నా ద్వారా మీరు సాయికి దగ్గరైతే దానికన్నా మహాభాగ్యమా! నాయీ చిన్న కోరిక తీర్చండి.

తీరుస్తారు కదూ!

పాఠక దేవుళ్లారా! ఇదే నా ఆశ. ఇదే నా శ్వాస.

\- సెలవ్.



# 'సాయివాణి'కి స్వరార్చన

- శ్రీమతి ఉమారమణ

సాయివాణి మా మనసు దోచే మాసపత్రిక
సాయివాణి మా చేతి కరదీపిక
మావాణి మమ్ము ధర్మమార్గంలో నడుపు ధర్మజ్యోతిక
సాయివాణి పెద్దలకు ప్రేమకానుక
బాలవాణి పిల్లలకు మా మాతాజీ అందించు
వెలకట్టలేని ఓ చిరుకానుక.
అందుకే -
సాయివాణిని వదలము ఏ కారణము చేత -
చేత పట్టిస్తాం ప్రతి యువతీ యువకుల చేత -
ఇది ఓ ధార్మిక, సామాజిక అద్భుత మాసపత్రిక- అందుచేత

## (ఓ పాత లేఖ)

**(ఇది పాతికేళ్లనాటి లేఖ. గురువుగారి పాత ఫైళ్ళలోంచీ బయటపడింది. తేదీలు పాతవైనా కొన్ని ఉత్తరాలు ఎవర్‌గ్రీన్ (సతతహరిత) సందేశాలు మోసుకొస్తాయి. మా చంద్రన్న యీ ఉత్తరం ద్వారా చేసుకున్న ఆత్మార్పణ పాఠకులకు ఆదర్శం కావచ్చునన్న ఉద్దేశ్యంతో యిది వేస్తున్నాం.**

**- సంపాదక వర్గం.)**

రవీంద్ర నగర్,
15-11-1990

పూజ్యులు డా॥ ప్రభూజీ గురుదేవులకు నమస్కరిస్తూ వ్రాయునది పాదాభివందనములు.

మీరు వ్రాసిన ఉత్తరము మాకు 13-11-1990 సాయంత్రం 6 గంటలకు ముట్టినది. అది చదివి అందరం చాలా సంతోషము మరియు దుఃఖము పొందినాము. సంతోషం ఉత్తరం వ్రాసినందుకు,





దుఃఖము మీరు పడుతున్న కష్టాలకు (నిద్రలేకపోవటం, కాళ్లనొప్పులు మొ॥). ఈ ఉత్తరం మీరు ఇచ్చిన అసైన్‌మెంట్‌కు జవాబే కాదు - నేను త్క్షణమే తీసుకొన్న నిర్ణయాలు కూడా.

## 23వ అధ్యాయం

నిషిద్ధ కర్మల నాచరించకుండుట, ఎల్లప్పుడు నేను ఒక సేవకుని మాత్రమేనని తలచుట, విధింపబడిన కర్మలు (సమితికి సంబంధించినవి ప్రత్యేకంగా) నిష్కామ కర్మతో చేయ తలపెట్టాను. ఏ విషయంలో గూడ ఇతరులతో పోటీ పడకుండుట, నా కొరకై ఇతరులనేమైన చేయమని కోరకుండ నేనే ఇతరులకు ఏమైనా చేయవలననే తలంపు, సమస్త జీవుల యందు మరియు వస్తువుల యందు భగవంతుని చూడాలనే ప్రయత్నం, ఎప్పడూ ఇతరులను దూషించుట, అవమానించుట వంటివి చేయకూడదనే తలంపు.

పై సప్త విషయాలను ఆచరణలో పెట్టుటకు కావలసిన శక్తి సామర్థ్యాలు మీ వల్ల పొందుటకు, మీ పాదముల యందు ప్రేమాయుత భక్తితో సర్వస్వ శరణాగతి చేసుకొనుచున్నాను. మీ యమృతము వంటి పలుకే మాకు చట్టం. ఎల్లప్పడు మేము మిమ్మల్నే ఙప్తియందుంచుకొనెదము గాక! మీ రూపమునే ధ్యానించుచు మీ యాజ్ఞల పాటించెదముగాక. మీరు ఇచ్చిన ఆజ్ఞ ఉచితమా? కాదా! అను విచారణగాని, అది సరియైనదా? కాదా? అని వాదించక, తర్కించక మీ ఆజ్ఞ అక్షరాల పాలించుటయే నా విధి మరియు ధర్మము అని తలంచుచున్నాను.

## 24వ అధ్యాయం

నేను చేసే ప్రతి కార్యమునందు జయము పొందవలెనన్న నా అహంకారమును మీ పాదములకు సమర్పించటం, ఎప్పడు సమయం దొరికినా సాయి నామ, రూప, గుణముల జపిస్తూ, సాయి లీలలను చదువటం, వినటం, మననము చేయటంలో నిమగ్నం చెందాలనే తపనను వృద్ధి చేసుకోవటం, నేనేమైనా తినే ముందు ఆ వస్తువును గురువునకర్పించి

భుక్తశేషమునే తినటం.

## 25వ అధ్యాయము

నాలోని రాక్షసత్వము, దైవత్వంల యొక్క పోరాటంలో దైవత్వం జయించుగాక! అని నిత్యం కోరుకోవటం, మన కోరికలన్నీ శీఘ్రముగా నెరవేరాలంటే మనము సాయిబాబా (గురువు)యందు స్థిరమైన నమ్మకముంచి మనఃపూర్వకముగా, ప్రేమయుత భక్తితో సేవించటం అత్యావశ్యకమని గ్రహించటం, ఉన్న దానితో సంతృప్తిచెందుటకు ప్రయత్నించటం, బాబా దయ గల తల్లివలె మనకు ఏది మంచిదో దానిని వారు మనకిచ్చెదరు-అది చేదైనా తీపైనా సమానదృష్టితో స్వీకరించుటే మన విధి అని తలంచటం.

**గురుదేవా, ప్రభూ, ఇది నా ప్రార్థన -**

సత్యదృష్టిని కలుగజేసి నన్నుద్ధరించండి.

అందుకై నేను **నా శరీరమును, ప్రాణమును సర్వమును నీకు సమర్పిస్తున్నాను.** సుఖదుఃఖానుభవములు కలుగకుండునట్లు నా నేత్రములు నీవిగా చేయుము. నా శరీరమును, మనస్సును నీ స్వాధీనయందుంచు కొనుచు నీ యిష్టము వచ్చినటుల చేయుము. నా యీ చంచల మనస్సు నీ పాదముల చెంత విశ్రాంతి పొందునట్లు చేయుము. మరియు ఇంద్రియములు లౌకిక విషయములపై బోనీయక అడ్డుకొనుము. నా దృష్టిని లోపలకు మరల్చి ఆత్మజ్ఞానము కలుగజేయుము.

ప్రభూ, ఈ జీవుడిపై దయ ఉంచి మీరు నన్నాశీర్వదించుడని ప్రార్థించుచు మీ పాదారవిందములకు నమస్కరిస్తున్నాను. మిమ్మల్ని చూడాలని ఆతురతగా ఉంది. మరి మీరు ఎప్పడాశీర్వదిస్తారో! సెలవు.

**ఇట్లు,**

**మీ వాడు,**

**జి. చంద్రారెడ్డి**





# అనుభవాలు-అనుభూతులూను-6

**- శుకవాణి**

ఫిరంగిపురం - పేరు అంతగా బాగుండని ఊరు. గుంటూరు నుండి నరసరావుపేట వెళ్లే దారిలో ఉంటుంది. ఊరికి చేరువలో పెద్దకొండ. దిగువన (అప్పట్లో ....ఎప్పడు? 1960-'62 మధ్య) పచ్చని నారింజ తోటలు, కొబ్బరి చెట్లు, రోడ్డుకు రెండువైపులా పరుచుకున్న మిరప, జనుము చేలు ... అందమైన ఊరే అన్పించేది. ఊరు చిన్నదేగానీ ఆ ఊళ్లో ఓ పెద్ద చర్చి, దాని ప్రక్కనే ఒక ఆడపిల్లల హైస్కూలు, అటువెనక వైపుగా ఒక మగపిల్లల స్కూలు, క్రైస్తవ సన్యాసినుల మఠం (కాన్వెంట్), అందులో ఒక టీచర్ ట్రెయినింగ్ స్కూలు -ఇవన్నీకలిసి ఊళ్లో సగం పైగా ఆక్రమించుకొన్నాయి. ఫిరంగిపురానికి కొద్ది మైళ్ల దూరంలో కొండవీడున్నది. శ్రీనాథ మహాకవి కాలంలో శత్రుదుర్భేద్యమని పేరందిన కోట శిథిలావస్థలో ఉందక్కడ. ఒక నాటి రెడ్డి ప్రభువుల రాజధాని-నేను చూచేనాటికే చిన్నపల్లెగా మిగిలింది.

ఊరి మొదట్లోనే కత్తులబావి కన్పిస్తుంది. నిజానికది చక్కని ఓ మాదిరి గుడి. విగ్రహాలేమీ లేవు. ఎవరో ఒక రాజు తన మీద కుట్ర నడుపు తున్న వారందరినీ మట్టుబెట్టడానికి గర్భగుడి వెనుకవైపు ఒక లోతైన బావి తవ్వించి, ప్రతి ఒఱకూ ఒఱకూ మధ్య చాలా పెద్ద పదునైన కత్తులు మూడు వైపుల నుంచీ బిగింపజేసాడట. కత్తుల మొనలు బావి మధ్యలో కేంద్ర బిందువులా కలుసుకొంటాయన్నమాట. బావి చీకటిగా ఉంటుంది. వెనుక నుండీ యీ గదిలో అడుగుపెడితే అక్కడ బావి ఉన్నదనే తెలియదు. అడుగుపెట్టిన మనిషి ఆ అగాధంలాటి బావిలోకి కత్తికొనలతో మూడు చీలికలైపోతూ జారిపోతాడు. ఆ రాజు ఉత్సవానికని పిలిచి తన వైరులంద రినీ ఆ బావిలోకి నడిచేలా చేసి చంపేసాడని స్థానికులు చెప్పేవారు. ప్రభుత్వం వారు ఆ బావిని పూడ్చేసి గుర్తుగా ఒక్క అడుగులోతు మాత్రం

ఉంచారు. పూడ్చేటపుడు వారు తీసిన కత్తులన్నీ గుడిలో ఓ ప్రక్కన పోగుబెట్టి ఉన్నాయి. అవి చేసి ఎన్ని వందల ఏళ్లయిందో తుప్పమాత్రం లేదు. ముగ్గురు, నలుగురం కలిసికూడా దాన్ని ఎత్తలేకపోయాం. మరి వాటిని ఆనాటివారు ఒక్క చేత్తో ఎలా పట్టుకొని యుద్ధం చేసేవారో తెలియదు.

కొండవీటి కొండమీద కోట చూడాలని కష్టపడి పైకి ఎక్కితే నాలుగు గోడలు తప్ప ఏమీ లేదక్కడ. అశ్వశాల ఒకటి ఉంది. బురుజులు కొన్ని మిగిలాయి. కొండ మీది 'నేతికొట్టు' అనే పేరుతో ఉన్న ఓ చిన్న గది ఉంది. అందులో ఎప్పుడూ పాదాలు మునిగేటన్ని నీళ్లుంటాయి. కొబ్బరి నీళ్లలా తియ్యగా ఉన్నాయి. కానీ ఎన్ని తాగినా దాహం తీరదు. రెడ్డిరాజుల కాలంలో అందులో నెయ్యి నిలవచేసేవారనీ, అది చెడిపోకుండా ఉండటానికి (నేతి పీపాలు) ఆ నీళ్లలో ఉంచేవారనీ, అందుకే ఆ నీళ్లు దాహాన్ని తీర్చవనీ అక్కడ ఆవులు మేపే ముసలాయన చెప్పాడు. ఆ నీళ్ల జల ఎక్కడుందో తెలియదు.

మరో విశేషం అక్కడి వెదుళ్ల చెరువు. కోట మీదికి వెళ్లడానికి సన్నని రాతిబాట ఏటవాలుగా ఉంది. ఆ బాటకు రెండువైపులా సన్నని వాగు ప్రవహిస్తోంది. ఆ వాగులోకి జారితే తిన్నగా వెదుళ్ల చెరువులో తేలతారట. ఆ చెరువు చాలా లోతుగా ఉంటుంది. ఓ పొడవాంటి వెదురుకర్ర దింపితే అడుగు తగలనే లేదు. అలా కొండవీటి దర్శనం మేము రెండు మూడు సార్లు చేసుకున్నాము. అంత తేలికగా ఎలా వెళ్లేవాళ్లమంటే అప్పట్లో నేను ఫిరంగిపురంలోని మిషనరీ స్కూల్లో పనిచేస్తున్నాను గనుక. అక్కడి చర్చి చాలా పాతది. అద్భుతమైన (డిజైన్స్) శిల్పకళతో విశాలమైన నిర్మాణం అది. ఫిరంగిపురం మీది నుంచీ వెళ్లే ప్రతి లారీ, కారూ ఆ ఊళ్లో తప్పక ఆగేవి. అక్కడ దొరికేలాంటి మసాలా పకోడీ రుచి మరెక్కడా రాదని ప్రతీతి. 90% నిజం కూడా. వాటికోసమే ప్రత్యేకంగా వచ్చేవారు కూడా ఉండేవారు.

ఆ ఊళ్లోని మిషనరీ పాఠశాల పేరు సెయింట్ ఆన్స్ స్కూల్. నేను అనేకానేక విషయాలు నేర్చుకున్నానక్కడ. మిషనరీ జీల్‌తో పనిచెయ్యటం,





నిర్మోహమోటంగా సబార్డినేట్స్ నుండీ పని చేయించుకోవటం, కష్టసహిష్ణుత, పైకి ఎంతో నిర్మలంగా కన్పిస్తూ కూడా లోలోపల రాజకీయాలు నడపడం, మనుష్యులలోని పలుముఖాల వ్యక్తిత్వాలు-యివన్నీ అక్కడే గమనించగలిగాను. అక్కడే అమాయకంగా ఉండటం వలన కలిగే యిక్కట్లు ఎలాంటివో తెలుసుకున్నాను. మన పని మనం నిజాయితీతో, నిర్భీకంగా చేసుకుంటూ వెడితే సత్ఫలితాలు వాటంతట అవే వస్తాయన్న సత్యం కూడా అక్కడే అనుభవమైంది. అయితే వీటన్నిటినీ మించి నా హృదయాన్ని యీనాటివరకూ వదలని అనుభూతి కూడా అక్కడే పొందాను. దాదాపుగా ఆ స్కూలు నా ఫస్ట్ ట్రయినింగ్ సెంటరనుకోవచ్చు.

మంచి క్రమశిక్షణకు సమయపాలన తొలిమెట్టు. అంచేత క్లాసుకు వేళకు రావటం, ఇచ్చిన పని చేయటం, సరైన సమయానికి జరగాలన్న పట్టుదల ఉండేవి నాకు- నేనైనా-పిల్లలైనా. వనజాక్షికి పదేళ్లు నిండి ఉంటాయంతే. సన్నగా, తెల్లగా, పెద్ద కళ్లతో, చిన్ని నోటితో, రెండు పిలకల్లాంటి చిన్న జడలతో ముద్దుగా ఉండేది. చదువు కూడా ఫర్వాలేదు. ఆ పిల్ల మెడలో పాముల పూసల దండ ఉండేది. పిల్లలు పోయి పోయి బ్రతికిన పిల్లలకు అలాంటి పూసలు కట్టేవారు ఆ ప్రాంతంలో. తెల్లని చిన్నపూసల మీద నీలిరంగు చారలున్న ఆ పూసలను పాములపూసలనేవారు. నాకా పిల్లపేరు చటుక్కున గుర్తు రాకపోతే 'పూసలూ' అని పిలిస్తే చిరునవ్వులు చిందిస్తూ వచ్చేది దగ్గరకు.

ఓ రోజు పిక్నిక్‌కు కొండవీటి కొండ మీదికి వెళ్లాం పిల్లలందరితో. ఆ రోజే నా పుట్టినరోజు. అందుకని నేను మిఠాయిలు పంచాను వాళ్లందరికీ. వనజాక్షి నా దగ్గరకు వచ్చి "టీచరండీ! నేను మిమ్మల్ని ముట్టుకోవచ్చా?" అన్నది. నేను నవ్వి "ఎందుకు ముట్టుకోకూడదు? నువ్వు మా అమ్మాయివేగా!" అన్నాను. చటుక్కున నా కుడి చెయ్యి అందుకొని మునివేళ్లు ముద్దు పెట్టుకొన్నది. ప్రక్కనే ఉన్న సిస్టర్ సెలెస్టీనా "అబ్బో!" అని నవ్వింది. తర్వాత చెప్పింది-బిషప్‌గారు వచ్చినప్పుడూ, మరెవ్వరైనా మాన్యులు వచ్చినప్పుడూ రోమన్ కేథలిక్ మతస్థులు వారి పట్ల గౌరవం, ఆరాధన చూపించడానికి

అలా చేస్తారట. ఆ చిట్టి వనజాక్షికి నా మీద అంత అభిమానం ఏర్పడినందుకు సంతోషించాను.

వారం రోజులు గడిచాయి. పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. పోర్షన్లు పూర్తి చేయటం, రివిజన్ (పునశ్చరణ) చేయటం, అంతలో ఏదో ఫంక్షన్ వస్తే సాంస్కృతిక కార్యక్రమాలకు పిల్లల్ని తయారుచేయటం ... పనిఒత్తిడి బాగా పెరిగింది. ఆ రోజు ముగ్గురు పిల్లలు బడికి ఆలస్యంగా వచ్చారు. కొద్దిగా కోప్పడి లోపలికి రమ్మన్నాను. మర్నాడు కూడా వాళ్లు ఆలస్యంగానే వచ్చారు. మరోసారి యిలా వస్తే కొడతానని ఓ హెచ్చరిక చేసి రానిచ్చాను. తరువాతి రోజు సరిగానే వచ్చారుగానీ, ఆ మర్నాడు మళ్లీ ఆలస్యంగా వచ్చారు. నాకు కోపం వచ్చింది. ఒక స్కేలు (ఆ రోజుల్లో అన్నీ చెక్కస్కేళ్లే ఉండేవి) తీసుకొని అందర్నీ అరిచేతుల్లో ఒక్కొక్క దెబ్బ-కాస్త గట్టిగానే వేసాను. ఆ వేళ వాళ్లల్లో వనజాక్షి కూడా ఉంది. తనెప్పడూ ఆలస్యంగా రాదు. కానీ నలుగురితోపాటూ నారాయణా అని తనక్కూడా ఒకటి వడ్డించక తప్పలేదు. లేకపోతే పక్షపాతం చూపానని పిల్లల్లో ఒక తప్పు ఆలోచన వచ్చే అవకాశం ఉంది. అందరూ లోపలికి వెళ్లి కూర్చున్నారు. నేను ఆపిన పాఠం తిరిగి మొదలుపెట్టబోతున్నాను. వనజాక్షి నా దగ్గరకు వచ్చింది-గట్టిగా కళ్లు తుడుచుకొంటూ. "ఏమిటి?" అన్నాను కొద్దిగా కరుకుగానే. వనజాక్షి తన కుడిచెయ్యి నా ముందుకు చాపింది. దెబ్బవలన కందిన అరిచేతిలో పెద్ద సంపెంగపువ్వు. "మీకే టీచరండీ! మీకిష్టంగదా!" అన్నది చిరునవ్వుతో. నా గుండె కలుక్కుమన్నది. పువ్వు తీసుకొని "థేంక్యూ" అంటే సిగ్గుగా నవ్వి వెళ్లి తన చోట్లో కూర్చున్నది వనజాక్షి. నాలోని భావోద్వేగాన్ని అదుపులో ఉంచుకొని పాఠం మొదలుపెట్టాను. నాకు సంపెంగ పువ్వులు ఇష్టమని వనజాక్షి ఎలా గుర్తించగలిగింది? అంత చిన్నపిల్లకు ఎదుటి వాళ్ల యిష్టాయిష్టాలు గమనించగలంత పెద్ద మనసు ఎలా వచ్చింది?-ఈ ఆలోచన నా లోలోపల కదులుతూనే ఉంది రోజంతా.

స్కూలు ఫంక్షన్‌లో వనజాక్షి చక్కని జానపద నృత్యం చేసింది. "అవిసె





పువ్వులు రెండు అందకున్నయి నాకు" అనే పాటకు. బాగా చేసినందుకు తనకీ, నేర్పినందుకు నాకూ బహుమతులు వచ్చాయి కూడా. మరో పదిరోజులు గడిచాయి. వనజాక్షి, మరికొందరు పిల్లలూ యీ ఫంక్షన్ కారణంగా బాగా చనువయ్యారు. వనజాక్షైతే సాయంత్రం యింటికి వెళ్లేటప్పడు నేనెక్కడున్నా వెతుక్కుంటూ వచ్చి మరీ "వెళ్లొస్తా" అని చెప్పి మరీ వెళ్లేది.

ఒకరోజు వనజాక్షి బడికి రాలేదు. మర్నాడు, ఆ మర్నాడు కూడా రాలేదు. "దానికి జ్వరం వచ్చింది" అని చెప్పారు దాని స్నేహితులు. మరో రోజు గడిచింది. పిడుగులాంటి వార్త తెచ్చారు. "వనజాక్షి రాత్రి చచ్చిపోయింది" అని. నమ్మలేకపోయాం. అందరం వాళ్ల యింటికి పరుగెత్తుకు వెళ్లాం. మామూలు జ్వరానికే యిలా ఎలా జరిగింది? డాక్టరు మందులిచ్చారు గదా-జవాబులేని ప్రశ్నలు. 'మృత్యువుకు కారణాలు రకరకాలుగా ఉండవు-ఒకే ఒక్క కారణం ఆయువుతీరిపోవటం' అని మా నాన్నమ్మగారు అంటుండే మాట గుర్తు వచ్చింది.

ఇంకో పదిహేను రోజులు తరువాత వనజాక్షి తాతగారు బడికి వచ్చారు. "మా పిల్ల పుస్తకాలు, ప్రోగ్రెస్ కార్డు-అవీ యిచ్చెయ్యండమ్మా! అది తెమ్మన్నది" అంటూ బావురుమన్నాడు. అందరికీ కన్నీళ్లు వచ్చాయి. "నలుగురు పోయి బతికిందమ్మా! కట్టుకుపోయేంత ఆస్తి ఉంది. ఏం చేసుకోనమ్మా!" అని ఆయన ఏడుస్తోంటే నాకు దేవు(డి మీద పట్టరాని కోపం వచ్చింది. నాకు తెలుసు-ఆయన పుస్తకాల కోసం రాలేదు. తన బాధ పంచుకోవడానికి వచ్చారని. కాస్సేపటికి తేరుకొని, జేబులోంచీ కొంత డబ్బు తీసి "పిల్లలందరికీ దాని పేరిట మిఠాయి కొనివ్వండమ్మా!" అని చెప్పి వెళ్లిపోయారు. అందరం కన్నీళ్లతో వీడ్కోలు చెప్పాం.

ఇప్పటికీ ఎప్పడైనా నా మునివేళ్లవైపు చూచుకొంటే - వెంటనే వనజాక్షి గుర్తు వస్తుంది. సంపెంగ పువ్వు చూస్తే-చూస్తే కాదు ఆ పేరు వింటేనే కందిన ఆ పిల్ల అరిచేతిలో సంపెంగ గుర్తు వస్తుంది. వనజాక్షి జ్ఞాపకార్థం నేను గత యాభైమూడేళ్లలో మళ్లీ సంపెంగ పువ్వు పెట్టుకోలేదు. పెట్టుకోవటం కాదు-తాకనైనా లేదు.